# నిర్ధన పురుషః

"ప్రొద్దున్నే స్నానం చేసి, కొంచెంసేపు పూజపునస్కారం చేసుకుంటానే" అంటే

"ఉద్యోగం సద్యోగం లేదు అందరి స్నానాలూ అయ్యాక పది గంటలకు ప్రశాంతంగా మీకు కావలసినంత సేపు పూజ చేసుకోండి" అంటుంది.

"కాళ్లు లాగుతున్నాయి పడతావూ" అంటే

"ఏం పాటు పడుతున్నారని కాళ్లు లాగడం? కదలకుండా కాస్సేపు పడుకోండి. అవే తగ్గిపోతాయి పెద్దాడికి తలనెప్పిగా వుందట కాస్సేపు వాడి దగ్గర కూర్చొని వస్తాను" అంటుంది.

"అరేయ్ తాతయ్యని ఏమీ అడక్కూడదు"

"ఎందుకని?"

"తాతయ్యకి ఉద్యోగం లేదు. ముసలాడైపోయాడని తాతయ్యని ఇంటికి పంపించేశారట. అందుకని జీతం రాదుట"

"అలాగా పాపం" మనవళ్లు అనుకుంటున్నారు.

తెలుగు లెక్చరర్‌గా ఉద్యోగం నుండి రిటైరై ఆరు నెలలైంది. పెద్దబ్బాయి దగ్గర వుంటే సౌకర్యంగా వుంటుందని, పెద్దబ్బాయి దగ్గర ఉంటున్నాం నేను నా శ్రీమతి. చెరుకుగడలో రసం తీసేస్తే ఆ పిప్పి కట్టెలుకు బదులుగా వాడతారు. ధాన్యంవిడిపోయాక, అప్పటి వరకూ ధాన్యాన్ని మోసిన అధాన్యపు కంకులకు వున్న పైరు గడ్డి అయిపోతుంది. అయినా అది పశువులకు మేతగా పనికి వస్తుంది. కాని రిటైరయిన ప్రభుత్వోద్యోగికివిలువ వుండదు. కారణం, నామ మాత్రపు పెన్షను మాత్రమే వస్తుంది అతనికి. ఫెళఫెళలాడే నోట్ల కట్టలు తేలేడు మరి.

నేను ఆశించింది నా ప్రియమైన భార్యనుండి ప్రేమానురాగాలు, ఆప్యాయత- ఆదరణ. అసలు ఈ ముసలితనంలోనే మనిషికి స్త్రీ ఆలంబన

కావాలి. కాని నెలకుపెద్దజీతం ఎప్పటిలాగాతేలేని నన్ను, ఒకఅనామకుడిగా చూస్తూ నాపెద్దకొడుకుని ప్రముఖునిగాచూస్తున్న నాభార్యమనస్తత్వంచూస్తూ నా దుర్గతికి చింతిస్తున్నాను. "నిర్ధన పురుషః శవసమానః అని చెప్పారు. డబ్బు లేకపోతే కట్టుకున్న భార్యకు కూడా లోకువే.

o o o

కిటికీలోంచి సూర్యకిరణాలు నాపై ప్రసరిస్తున్నాయి. "జానకీ" పిలిచాను.

"ఏమిటి ప్రొద్దున్నే ఏమయిందీ? రాత్రి బాగానే వున్నారుగా?" విసుక్కుంటూ వచ్చింది.

"నీకో శుభవార్త చెప్పనా?"

"ఆ ఏముందీ. రిటైరయిన వాళ్ళకి డి.ఎ. పెంచి వుంటారు"

అదే చులకన అభిప్రాయం.

"కాదే పిచ్చిదానా. నేను ఒక ట్యూటోరియల్ కాలేజీలో ప్రిన్సిపాల్ గా చేరాను. నెలకు మూడు వేలు జీతం. ఈ రోజునుండే వెళ్ళాలి."

"అలాగా" ఆమె ముఖంలో చాన్నాళ్ళకు వెలుగు చూశాను. అది లక్ష్మీ కళ వున్న వెలుగు!

పెద్దాడికన్నా నాకు ముందు స్నానం ఏర్పాట్లు చేసింది. మనవళ్ళు నా దగ్గరకు వచ్చారు "తాతయ్యా బ్రెడ్ కొని పెట్టమంటూ."

"జానకి ఆ రోజు రాత్రి నా కాళ్లు పడుతుంది.

"జానీ అవే తగ్గిపోతాయిలే కాస్సేపు కదలకుండా పడుకుంటాను."

"చాల్లెండి చోద్యం, కాళ్లు పట్టకుండా నెప్పులు తగ్గిపోతాయా—మీరు మరీనూ" అంది.

ఆమె మనస్తత్వానికి ఆశ్చర్యపోయాను.

—o—